# శూర్పణఖ

[శ్రవ్యం]

శ్రీ రుక్మిణీనాథశాస్త్రి

[పంచవటి ప్రాంతాలు, గోదావరి ఒడ్డున, హేమంతకాలం, మధ్యాహ్నం సాయాహ్నంగా మారిపోతున్న వేళ, శూర్పణఖ, ఆమె చెలి వనలతా :]

శూర్పణఖ : నీవు ఎంత చెప్పినా, నా మనస్సు మారటంలేదు.

వనలత : నీవు, నీ విషయమై వచ్చేసరికి, చేలవై పోతున్నావు. పదిమందికి సర్ది చెప్పగలదానివి! మనసును అదుపులోకి తెచ్చుకోలేక పోతున్నావా అక్కా!

శూర్ప : [ఆలోచిస్తున్నట్లు] అక్కడికీ మనస్సును నేను ఎంతెంత కట్టి పడేస్తున్నానో నీకు తెలీదు వనలతా! రాముడు, సీతాలక్ష్మణులతో చిత్రకూటానికి వచ్చాడన్న మాట విన్నప్పుడే వొళ్లు జలదరించింది. మనస్సు ఝల్లుమంది. చిత్రకూటానికే పోదామనుకున్నాను.

వనలత : మంచిపని చేద్దామనుకున్నావు!

శూర్ప : తగినంత పెరగనిదీ, వాంఛేకాదు, బులబాటం అవుతుంది. ఉపేక్షకు అన్నీ లొంగి పడి ఉంటై అని ఉపేక్షచేసి, చూచాను.

వనలత : ఇప్పుడవన్నీ ఎందుకు? మనస్సు మళ్లించుకో.

శూర్ప : పంచవటికి వచ్చారు. ముని వేషధారులై, పర్ణశాలా నివాసం చేస్తున్నారని విన్నానూ, లంకలో నిమిషం ఉండలేక పోయాను. [నిట్టూరుస్తుంది]

వనలత : అక్కా శత్రువుల మీదా వలపు? తగదు.

శూర్ప : ఆపరాని వాంఛ, అక్కడే ప్రత్యక్షశాత్రవం! పరమేశ్వరుడు ఇంత పరీక్ష చేసిగాని విడువడు కాబోలు వనలతా.

వనలత : పరమశివుణ్ణే తలుచుకో. ఆ దేవదేవుడు మదనాంతకుడు.

శూర్ప : పంచవటికి వచ్చాను. లక్ష్మణుడు, ఎదురైనాడు. అతనే రాముడనుకున్నాను. పలకరించాను. కసిరాడు. రాముడు, మందహాస సుందరుడని కాదూ మరి! పోటు మానిసి రాముడు కాడని వెంటనే తెలిసింది. ముందుకు పోదామనుకున్నాను. లక్ష్మణుడు ముందుకు సాగనీయ లేదు.

వనలత : అంత అనుమానం వారికి మనమంటే అక్కా! నా మాటవిను.

శూర్ప : నా మాట విను వనలతా! లక్ష్మణుడు, వాడు ఆ లక్ష్మణుడు బహుజాగరూకుడు. అతణ్ణి సమాధాన పరచడం వృథా అని, అతను లేకుండా చూచి, మళ్లా వెళ్లాను.

వనలత : పా......పం!

శూర్ప : ఆ కాస్తసేపూ ఎంత బాధ పడ్డానని. [బరువుగా] చివరికి వెళ్లాను.

వనలత : ఊఁ.

శూర్ప : రాముడు, హృదయాభిరాముడు, సీతకు ఏదో కథ చెప్పుతున్నాడు. ఆ సీత, మైమరపించే కన్నుల సీత, రాముడి ఒళ్లో తల పెట్టుకుని పడుకుని కథ వింటోంది. [బాధగా] అప్పుడే నా పై ప్రాణాలు పైన పోయాయి! నేను ఆగలేను. రాముడికి నా హృదయాన్ని నివేదించనిదే జీవింపలేను వనలతా! మళ్లా వెళ్లి చూస్తాను!

వనలత : [బరువుగానే] నీ అదృష్టం ఎలావుందో పద.

[పర్ణశాలలో సీతా, రాముడూ]

రాముడు : సీతా! నిన్నింత కష్టాలపాలు చేస్తున్నాగదా. రాకుమారివి, బహు సుకుమారివి. అంతఃపురానికి తగిన దాన్ని అడవుల పాలు చేశానే అన్న వ్యథ—

సీత : [వద్దన్నట్లు] ఆర్యపుత్రా !

రాముడు : నిజంగా, సీతా. ఒక ధర్మం ఒక ఆదర్శం అని వీటికై జన్మంతా ధారపోయడానికి నేను పుట్టాను. ఎక్కడున్నా నాకు ఒకటే. అయోధ్య అయినా సరే అడవి అయినా సరే ఇబ్బందిలేదు. అదే నా సేవారంగం కాగలదు. కాని, సీతా—

సీత : నాకూ అదే సేవారంగం. అదే స్వర్గం, పైగా—ఈ తమాలలతలు, సాంద్రగోదావరి, గోదావరి సన్నని సంగీతం, మనోజ్ఞ కింశుక ప్రవాళాల ధగధగలు, స్వామీ మిధిలలోనూ అయోధ్యలోనూ కానవచ్చేవి కావు. ఈ దండకకే రాకుంటే ఈశ్వర చిద్విలాసాన్ని యింత చవి చూచే దాన్ని కాదు. కాక నా స్వామి రామచంద్రులు ఎక్కడ ఉంటే అదే నా స్వర్గం.

రాముడు : ఇది ఉపద్రవమైన భూమి సీతా. జన స్థానం బహు దగ్గర. పాముతో పాటు కాపురం ఉన్నట్లుగా ఉందిక్కడ.

సీత : నా రాముడున్నాడు. నా రాముడు, కోదండరాముడు! అసహాయశూరుడు మా మరిది. సమస్త లోకమూ ఏకమై వచ్చి పడితేనేమి ?

రాముడు : [నవ్వుతాడు]

సీత : [ధనుస్సు—పుచ్చుకుని] స్వామీ మీరు ధనుర్ధారులై నుంచుంటే, ఒక్క వ్యాళి మేమిటి! కోటి పడగలెత్తి నట్లుండి గాండ్రించే మహాసముద్రం సైతం గడగడలాడి పోదా ?

రాముడు : సీతా! ఈ రాక్షసి మూకలది నయవంచన. [ఆగి] సరేకాని సీతా! వీరికి పసుపు అంటే యింత పిచ్చేమిటి ?

సీత : అది వారికి శుభకరమైనది కాబోలు.

రాముడు : పసుపు పసుపుపసుపు. మెడకు పసుపు ముఖాలకు పసుపు బట్టలకు తాము న్న నివాసాలకు అన్నింటికీ పసుపు.

సీత : నల్లటివారు కాదూ, ఆ నల్లటి ముఖాలపై పసుపు ఎంతో బాగుంటుంది.

లక్ష్మణ : [దూరంగా] అన్నయ్యా !

సీత : రావయ్యా !

లక్ష్మణ : [దగ్గరగా] గోదావరి దగ్గిరికి పోతాను. హంసలు రమ్యంగా నాట్యం చేస్తున్నవి.

రాముడు : పోయి చూచిరా తమ్ముడూ.

లక్ష్మణ : వస్తాను.

సీత : [నెమ్మదిగా] ఊర్మిళకూడా వచ్చి ఉంటే ఎంతో బాగుండేది.

రాముడు : [బరువుగా] కాదూ సీతా. [ఆగి] పరిశుభ్రమైన జలం—

సీత : తెస్తున్నా. ఈ గోదావరీ నిర్మల సలిలాలు. ఈ అనుకూల మృదుపవనాలు! ఇక్కడిదెంత రామణీయకము !

రాముడు : సీతా !

సీత : దాహంవేస్తున్నది కాబోలు. ఆర్యపుత్రా ! గోదావరికి పోయి తీసుకురావలె. ఒక్కలిప్త తాళండి. క్షణంలో తెస్తాను.

రాముడు : సీతా !

సీత : తెచ్చేస్తున్నాను. హంసల నృత్యాన్ని చూస్తూ మైమరచి ఉండను. వచ్చేస్తున్నా. ఎవరో వస్తున్నారు. స్త్రీ. యీ స్త్రీలెంత సుందరులు ! తెల్లనిచీర. అక్కడక్కడ కొద్దిగా పసుపువన్న లేపనమూ. ఏ కల్యాణ కామనతో వస్తున్నారో ఆమె. ఎదురుగా వెళ్లితే—"సుమంగలి ఎదురుపడింది, వచ్చినపని అవుతుందని," ఆమె ఎంతో సంతోషిస్తుంది !

రాముడు : సీతా !

సీత : వెళ్లుతున్నా. ఆలస్యంకానీను వచ్చేస్తున్నా—రండి ! రండి !—

రాముడు : అమ్మా రండి. సుఖంగా కూర్చోండి.

శూర్పణఖ : చిత్రకూటంనుంచి వచ్చారా, చిత్రకూటానికే వచ్చి, స్వాగతమిద్దామనుకున్నాను. పడింది కాదు. సుఖంగా ఉంటున్నదా ఇక్కడ?

రాముడు : [నవ్వి] ఆ!

శూర్పణఖ : యివన్నీ అంత మంచి ప్రదేశాలు కావు. ఉరగ ధారుణాలు. స్వామీ ఎంతో దూరం లేదు లంక, తమ అయోధ్య కంటె, దగ్గిరే. మా లంకకువచ్చి, తాము నివసించగూడదూ?

రాముడు : [నవ్వి] వీలుకాదు.

శూర్పణఖ : లంక బహు సుందర మైనది.



రాముడు : [మౌనం].

శూర్పణఖ : నన్ను అనుగ్రహించి, దాసిగా, సఖిగా[ఆగి]భార్యగా.

రాముడు : అనగూడని మాటలివి కల్యాణీ.

శూర్పణఖ : ధర్మచ్యుతిలేదు, ఆర్య పుత్రా!

రాముడు : చెవులు మూసుకుంటు న్నాను. ఆర్యపుత్రా అని నన్ను పిలవ నర్హురాలు సీత ఒక్కతే. మీరు వెళ్లండి.

శూర్పణఖ : (ఆశగా) రామా!

రాముడు : (గట్టిగా) సీతా! సీతా!

సీత : [దూరంగా]వస్తున్నా. (వచ్చి) నిర్మలోదకం ఇదిగో.

రాముడు : అనే విన్నాను.

శూర్పణఖ : మా అన్న లంకేశ్వరుడు, సౌమ్యసుందరుడు. మీరువచ్చి, మా దేశాన్ని అలంకరించాలని నా కోర్కె.

రాముడు : [నవ్వుతాడు].

శూర్పణఖ : నిత్య శివార్చనలతో పరమపావనమైన మా లంకను తాము చూస్తే-విడువరు.

రాముడు : తమ నామధేయం చెప్పారు కాదు.

శూర్పణఖ : శూర్పణఖ.

రాముడు : అన్వర్థమైన పేరు. మీ గోళ్లు పెద్దవికదూ మరి.

శూర్పణఖ : ధన్యను.

రాముడు : [బరువుగా] ఆ! ఏమిటీ?

శూర్పణఖ : స్వామీ, దాసి విన్నపం. ఈ నా హృదయ పంకజము, తమ పాదాలకు సమర్పితమైనది. నా పంచ ప్రాణాలూ, లీలా శుకమై మీ చేతిని వ్రాలినవి.

రాముడు : ఈమె—

శూర్పణఖ : సీతా! చెల్లెలు నమస్కరిస్తూంది.

రాముడు : సీతా! వెళ్లిపొమ్మను—

సీత : ఏమమ్మా! తామెవరు?

రాముడు : సీతా!

సీత : ఇంటికివచ్చిన అతిథి. రా అమ్మా. పర్ణశాలలోనికి రా.

రాముడు : (వినవేమి అన్నట్లు) సీతా!

సీత : నవ్వు ముఖం ఇంతలో మారింది. అమ్మా రామచంద్రుల్ని ఏమన్నా, నొప్పించావా?

శూర్పణఖ : సీతా!

రాముడు : [మాట వినవేం] సీతా!

సీత : అసమయంలో వచ్చినట్లున్నావు తల్లీ. రామచంద్రులిప్పుడు మాట వినరు.

రాముడు : సీతా!

శూర్పణఖ : [దీనంగా] రామా! రామా!

సీత : మా మరిది స్నానంచేసి వస్తున్నాడు. వెళ్లమ్మా. వెళ్లి ఆయనతో చెప్పుకో. రామచంద్రులతో చెప్పినట్లే. అంతా అతను వింటాడులే.

శూర్పణఖ : రామా! [నిష్క్రమణ].

సీత : పాపం వెళ్లింది. ఎందుకలా కసరి పొమ్మన్నారు?

రాముడు : [మౌనం].

సీత : నాగ్గూడా చెప్పగూడదా?

రాముడు : [విసుగ్గా] కాముకి!

సీత : ఊఁ?

[ప్రక్కనే ఉన్న గోదావరి ఒడ్డున వృక్షచ్ఛాయన వ్యధాకుల శూర్పణఖా, చెలి వనలతా]

వనలత : ఎంత అన్యాయం జరిగిందీ...?

శూర్పణఖ : చేసిన పాపానికి ప్రాయశ్చిత్తం.

వనలత : ఇంత పరాభవమటే, ఎంత క్రొవ్వి ఉన్నారు వారు?

శూర్ప : ప్రేమకు పరాభవమేమిటి, అందరూ ప్రేమించి తమతమ జన్మలను సార్థకం చేసుకుంటారు. దౌర్భాగ్యురాలిని, ప్రేమించి ప్రేమించి ముక్కూ చెవులూ కోయించుకున్నాను.

వనలత : విన్నావుగదా. వారు ఆర్యులు. వారికి నల్లని శరీరం ఉజ్జ్వలమైన నేత్రాలూ గిట్టవు. అంటే! పైగా, నీ వెర్రిగాని అక్కా. మన్నితుదముట్టించను వచ్చిన వారు మన వినాశనం తమకు ఉత్సవం అనుకునేవారు మన్ని ప్రేమిస్తారటే—?

శూర్ప : ప్రేమ హృదయానిదే. హిత శాత్రవాలు అలా కావనుకున్నా.

వనలత : కటికవాడు, ఆ లక్ష్మణుని దగ్గరకు పోకుండా తిరిగి రావలసింది!

శూర్పణఖ : రత్నం దొరకనప్పుడు, గాజుపూసకే మోహం వాచిపోయినట్లు వెళ్లాను. అనుభవించవద్దా చేసుకున్న కర్మ?

వనలత : వారూ అనుభవింపక పోరులే! యింతకు పదింతలు అనుభవానికి రాకపోదు.

శూర్పణఖ : నిద్రపోనిస్తామా! (నిట్టూరుస్తుంది) లే వనలతా, [కోపంగా] పద!

[ఆలిండియా రేడియో ఆదరాభిమానాలతో].

★



Source: Press Academy Website, Andhra Mahila, Jan 1948

**Disclaimer:** This topic/article/write-up has been posted here to increase the availability of some rare, forgotten and precious material for appreciation by a wider audience and with no intention what so ever of copy right violation.

Request for removal of any copyrighted material, by the owner, will be promptly complied with.

Maganti Vamsi Mohan
http://www.maganti.org/